3

# “నేనేమి చేయాలి?”

అపొస్తలుడైన పేతురు ప్రభువైన యేసును గూర్చి ప్రకటించగా, అతని శ్రోతలు, “సహోదరులారా, మేమేమి చేతుము?” అని బిగ్గరగా అడిగారు (అపొ. 2:37). క్రీస్తు ప్రభువు సౌలుకు ప్రత్యక్షమైనప్పుడు, “ప్రభువా, నేనేమి చేయవలెనని” అడిగాడు (అపొ. 22:10). ఫిలిప్పీలోని చెరసాల నాయకుడు కొంచెంలో మరణాన్ని తప్పించుకున్నవాడై, “–అయ్యలారా, రక్షణపొందుటకు నేనేమి చేయవలెననెను?” (అపొ. 16:30). “నేనేమి చేయాలి?” అనే దానికంటె మించిన ప్రాముఖ్యమైన ప్రశ్నను నీవు అడుగలేవు.

## చేయడానికి ఏదో ఒకటుంది

నీవు రక్షణను వాంఛించినట్లయితే చేయడానికి ఏదో ఒకటి ఉన్నట్టు మొదటిగా మనం స్థాపించవలసియుండవచ్చు. క్రీస్తు సర్వమానవాళికొరకు మృతిపొందిన మాట వాస్తవమే (తీతు 2:11), కాని అందరు రక్షింపబడతారని దాని భావం కాదు. నరులు రెండు మార్గాల్లో పయనిస్తారన్న సంగతిని ప్రభువు తెలియజేశాడు: “జీవానికి నడిపే” యిరుకు మార్గము, మరియు “నాశనానికి నడిపించే” విశాల మార్గములనేవి. “అనేకులు” విశాలమైన మార్గంలో ఉన్నారని, యిరుకు మార్గంలో ఉన్నవారు “కొందరే”యని ఆయన నొక్కి పలికాడు (మత్తయి 7:13, 14). అంటే, అనేకులు నశించిపోతారని, దానితో పోల్చితే కొద్దిమంది రక్షింపబడతారని దాని భావం.

రక్షణ అనేది ఈవి లేక బహుమానం, అయితే ఈ బహుమానాన్ని అంగీకరించవచ్చు, నిరాకరించవచ్చు. ప్రతి వ్యక్తి దేవుని కృపా బహుమానాన్ని అంగీకరించాలో లేక నిరాకరించాలో నిర్ణయించుకోవచ్చు. దేవుని కృపా ఈవిని అనేకులు నిరాకరిస్తారని మత్తయి 7లో క్రీస్తు ప్రభువు ప్రకటించాడు.

రక్షణ అనే ఈవిని మనం ఎలా అంగీకరించగలం? **విశ్వాసంతో కూడిన విధేయతతో** దానిని స్వీకరించాలని దేవుడు తన వాక్యమందు మనకు తెలియజేస్తున్నాడు. “–ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును” అని క్రీస్తు ప్రభువు చెప్పాడు (మత్తయి 7:21).[1] హెబ్రీ గ్రంథపు లేఖకుడు ప్రభువైన యేసును గూర్చి మాట్లాడుతూ, “తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను” అని తెలిపాడు (హెబ్రీ. 5:10).[2]

కొందరు దీనికి ఆక్షేపణ తెలుపుతారు. రక్షింపబడడానికి మనుష్యులు చేయవలసింది ఏదైనా ఉంటే, అలాటప్పుడు రక్షణ కృపవలన అయ్యుండదు అని వారంటారు. మన విధేయత రక్షణను సంపాదించలేదన్న సంగతి స్పష్టంగా గ్రహింపవలసియుంటుంది. ప్రభువుచేత ప్రసాదించబడే రక్షణను విధేయతద్వారా మనం వినియోగించుకోవచ్చు.

**సంపాదించుకొనడం** మరియు **వినియోగించుకోడం** అనేవాటి మధ్యనున్న వ్యత్యాస మేమి? ఈ క్రింది ఉదాహరణ వాటి మధ్యనున్న వ్యత్యాసాన్ని గ్రహించడానికి నీకు సహాయపడుతుంది:

ఒక మనిషి ఒక యింటి తలుపును తట్టాడు. తలుపు వద్దకు ఒక స్త్రీ వచ్చినప్పుడు, "నాకు బహు ఆకలిగా ఉంది. ఒక భోజనాన్ని సంపాదించుకోగల పని ఏమైనా ఉందా?" అని అతడు ఆమెనడిగాడు. "ఇంటి వెనుక ముక్కలు చేయవలసిన పొడవాటి మొద్దులున్నాయి, నీవు వాటిని ముక్కలుగా కొట్టినట్టయితే, భోజనం చేయవచ్చు"నని ఆమె జవాబిచ్చింది. అతడు ఆ మొద్దులను నరికి, భోజనానికి కూర్చున్నాడు. నేను నిన్ను ఒక ప్రశ్న అడగనీయ్యి: ఆ మనిషి ఆ భోజనం చేస్తుండగా, ఆ భోజనాన్ని సంపాదించుకున్నట్టి భావన కలిగి యుంటాడా? తప్పకుండ.

కథను మార్చుతాను: ఒక మనిషి ఒక యింటి తలుపును తట్టాడు. తలుపునొద్దకు ఒక స్త్రీ రాగా, "నాకు బహు ఆకలిగా ఉంది. నేనొక భోజనాన్ని సంపాదించుకోగల పని ఏదైనా ఉందా?" అని అతడామెను అడిగాడు. "నేను తినగలిగిన దానికంటె చాల ఎక్కువ భోజనాన్ని బల్లమీద పెట్టి ఉంచాను, నీకు కావలసినంత వచ్చి తినుమని" ఆమె అన్నది. ఆమె ఆహ్వానాన్ని అతడు ఆనందంగా అంగీకరించి, ఆమె సిద్ధపరచిన ఆహారాన్ని ఆరగించనారంభించాడు. మరల తిరిగి ప్రశ్న అడుగుతా: ఆ మనిషి ఆ భోజనాన్ని సంపాదించుకున్నాడా? తప్పక లేదు. అది కేవలం ఉచితంగా "కృపచేత" యివ్వబడిందే. అతడు చేసేదంతా **వినియోగించుకొనడమే.**

అతడు దాన్ని ఎలా **వినియోగించుకొన్నాడు**? ఆ స్త్రీ యొక్క ఆహ్వానాన్ని అంగీకరించి, ఆమె యింటిలోనికి వచ్చి ఆమె భోజనపు బల్ల వద్ద కూర్చుండి ఆ భోజనాన్ని ఆరగించడం చేతనే. అతడు దాన్ని సద్వినియోగం చేసికొనకపోతే ఏమైయుండేది? "లేదు, వందనాలు" అంటూ అతడు వెళ్లిపోతే ఏమి జరిగేది? అతడు యింటిలోనికి మాత్రం ప్రవేశించి, ఆ భోజనం చేయకుంటే ఏమైయుండేది? దయతో ఆమె యిచ్చిన అవకాశంవలన అతడు తప్పక మేలు పొందకపోయేవాడే. (అవును, ఈలాటి ప్రతిచర్యలు అవివేకంగా కన్పిస్తాయని నాకు తెలుసు, కాని ప్రభువు యొక్క రక్షణను జనులు అన్ని వేళల తిరస్కరిస్తారు [ప్రకటన 3:20] యిట్టిది మరీ అవివేకంగా కన్పిస్తుంది.)

మన రక్షణను మనం సంపాదించుకోలేము, కాని విశ్వాసంతో కూడిన విధేయత వలన – దేవుని యొక్క ఈవిని లేక వరమును మనం వినియోగించుకోవచ్చు, అభినందించాలి కూడా. మన పఠనం కొనసాగిస్తుండగా, విశ్వాసంతో కూడిన మన విధేయతలో ఏమి చేర్చబడియుందో తేటపరచబడుతుంది.

## మనం చేయవలసిందేమి

ప్రభువైన యేసు ఘనత్వముగల ఉత్తరువును తన శిష్యులకు జారీ చేసినప్పుడు, "–మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును ..." అని చెప్పారు (మార్కు 16:15, 16). "కాగా

వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" అని పౌలు తెలిపాడు (రోమా 10:17). అంతేకాదు, (యేసును గూర్చిన శుభ సందేశం[3]) సువార్త "రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" అని కూడా అతడు సూచించాడు (రోమా 1:16). ప్రభువైన యేసును గూర్చియు, ఆయన మార్గమును గూర్చియు నేర్చుకొనుటతో రక్షణ ఆరంభమౌతుంది. బాధ్యతకలిగి ప్రత్యుత్తరమిచ్చే విద్యార్థిలా, ఒకడు వినువాడై లేక పాఠకుడైయుండాలి. ఇక మిగిలిన పాఠంలో, సువార్తకు యివ్వవలసిన మూడు ప్రతిచర్యలను గూర్చి చర్చించుదాం.

**యేసునందు విశ్వాసముంచుము**

మొదటి ప్రతిచర్య విశ్వాసము లేక నమ్మిక: "వినుటవలన విశ్వాసము కలుగును." విశ్వాసము యొక్క ప్రాముఖ్యత యోహాను 3:16లో వక్కాణించబడింది: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." క్రైస్తవులు విశ్వాసంచేత రక్షింపబడ్డారని బోధించిన లేఖన భాగాలలో అపో. 16:31, రోమా 5:1, మరియు ఎఫెసీ. 2:8, 9లు ఉన్నాయి. "నేను ఆయననని [అంటే, మెస్సీయానని[4]], మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు" అని ప్రభువు అన్నారు (యోహాను 8:24).

"విశ్వాసము" మరియు "నమ్మిక" అనేవాటికి ఒకే అర్థం. "విశ్వాసము" అంటే ఒకటని, "నమ్మిక" అంటే మరియొకటని కొంతమంది అంటారు, కాని రెండును ఒకే గ్రీకు పదంనుండి తర్జుమా చేయబడ్డాయి. రక్షించే విశ్వాసమేది? రక్షించే విశ్వాసాన్ని "నమ్మకము" (trust) అని చెప్పవచ్చు: రక్షింపబడడానికి మన సొంత మంచితనము నందు నమ్మికయుంచడం మాని క్రీస్తు ప్రభువు యొక్క బలిమీద నమ్మకముంచడానికి ఆరంభించాలి.[5]

విశ్వాసం యొక్క ప్రాముఖ్యతను మనం ఎక్కువగా నొక్కి చెప్పలేం. ప్రభువు పట్ల చూపే అనుకూలమైన ప్రతిచర్య ప్రతిదానికి పునాదిగా ఉంటుంది. "ఆయన [క్రీసు] తన స్వకీయులయొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు. తన్ను ఎందరంగీకరించిరో[6] వారికందరికి, అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" అని యోహాను 1:11, 12ల్లో మనం చదువుతాం. "విశ్వసించడం," "అంగీకరించడం" అనే పదాలు ఒకదానికి బదులు మరొకటి ఉపయోగించబడినట్టు గమనించు. ఆయనయందు విశ్వాసముంచకుండ ప్రభువైన యేసును మన జీవితాల్లోనికి అంగీకరించలేం.

దురదృష్టవశాత్తు, కొందరు విశ్వాసాన్ని ఒంటరిదానిగా నిలిపి, "విశ్వాసంవలన మాత్రమే" రక్షింపబడగలమని బోధిస్తారు. విశ్వాసం మన ప్రతిచర్యకు ఆరంభమే కాని అంతం కాదు. యోహాను 1:11, 12 తిరిగి చదువు. "విశ్వసించినవారును/అంగీకరించిన వారును" దేవుని కుమారులగుటకు **అధికారం అనుగ్రహింపబడ్డారు.** నేను నా భార్య జో వివాహం చేసికొనకముందు, వివాహపు లైసెన్సు పొందాం. ఆ లైసెన్సు వివాహం

చేసికొనడానికి మాకు లభించింది; అంటే అప్పటికే మేము వివాహం చేసికొన్నామని దాని అర్థం కాదు. అలాగే, విశ్వాసమనేది రక్షణ మార్గంలో మనలను నిలుపుతుందే కాని, అది ప్రయాణాంతం కాదు. మనం విశ్వాసంచేత రక్షింపబడే మాట వాస్తవమే గాని, విశ్వాసమువలన మాత్రమే కాదు.

రక్షించే విశ్వాసం, విశ్వాసాన్ని వ్యక్తపరచడంనుండి వేరు చేయదు. యోహాను 3చే ఉదహరించవచ్చు. విశ్వాసం యొక్క ఆవశ్యకతను 16వ వచనం నొక్కి చెప్పుతుంది. ఇప్పుడు, ఆ అధ్యాయం యొక్క చివరి వచనాన్ని చదువుదాం: "కుమారునియందు **విశ్వాసముంచువాడే** నిత్యజీవముగలవాడు, కుమారునికి **విధేయుడు** కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును" (36 వ.).[7] క్రొత్త నిబంధనలో "విశ్వాసము" మరియు "విధేయత" అనేవి ఒకదానికి బదులు మరొకటి[8] వినియోగించ బడిన స్థలాల్లో యిది ఒకటి (రోమా 10:16 కూడా చూడు). రక్షించే విశ్వాసము విధేయతతో కూడిన విశ్వాసమైయుంది.

బైబిల్లో "విశ్వాసమూలమున మాత్రము" అనే పద ప్రయోగము యాకోబు 2:24లో కన్పిస్తుంది. "విశ్వాసమూలమున మాత్రము" మనం రక్షింపబడలేదని అది తెలుపుతోంది. "మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రము కాక క్రియల మూలముననను నీతిమంతుడని[9] యెంచబడునని, మీరు దీనివలన గ్రహించితిరి" అని తెలుగు తర్జుమాలో ఉంది. "మనుష్యుడు విశ్వాసమూలముననే కాదుగాని క్రియల మూలముననను నీతిమంతుడని తీర్చబడుచున్నాడు" అని NASB అంది.

యాకోబు 2:14-26ను చదవడానికి ఒకటి రెండు నిమిషాలు తీసికొని, దాని లైన్ ఆఫ్ రీజనింగ్‌ను చూడవచ్చు. 14, 17, 20 మరియు 26 వచనాలమీద దృష్టి నిలుపు:

> నా సహోదరులారా, క్రియలులేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? ... ఆలాగే విశ్వాసము క్రియలులేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును.
>
> ... వ్యర్థుడా, క్రియలులేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా? ... ప్రాణములేని శరీరమేలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసము మృతము.

రక్షించే విశ్వాసము మృతమైనదో, ఒంటరిగా ఉండునదో, నిష్ఫలమైనదో కాదు. అది సజీవమైనదియు, చురుకైనదై పని చేయునదై ఉంది.


**పాపముల విషయమై మారుమనస్సు పొందు**

నిజ విశ్వాసం తన్ను తాను బయలుపరచుకొనే ఒక విధానం మారుమనస్సు పొందడంలో కన్పిస్తుంది. ప్రభువు యిలా అన్నాడు, "... మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3). తన శ్రోతలకు పేతురు యిలా తెలియజేశాడు, "మీరు మారుమనస్సు పొంది, ... ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపొ. 2:38). పౌలు యిలా పలికాడు,

"… ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని (దేవుడు) మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపో. 17:30).

ప్రభువైన యేసునందు మన విశ్వాసం అభివృద్ధి చెందుచుండగా, మనమేమై యున్నామో మనలను మనం చూచుకోగలగాలి: రక్షణ యొక్క అవసరంలోనున్న పాపులం.[10] ఇది మారుమనస్సును పుట్టించాలి.

వాస్తవంగా మారుమనస్సు అంటే ఏంటి? పాపాలను గూర్చి దుఃఖించడం మారుమనస్సు అని కొందరు తలంచుతారు. జీవితపు మార్పు అని మరికొందరంటారు. ఒక మనుష్యుడు నిజంగా మారుమనస్సు పొందినప్పుడు, తాను పాపం చేసినందుకు దుఃఖిస్తాడు, మరియు అతని జీవితం మార్పు చెందుతుంది, అయితే మారుమనస్సనేది ఈ రెండు ప్రతిచర్యలకు మధ్య నిలుస్తుంది.




పైన చూపబడిన పటములో, దైవ చిత్తానుసారమైన దుఃఖము మారుమనస్సును పుట్టిస్తున్నట్టు గుర్తించు. 2 కొరింథీ. 7:10 మనకు యిలా తెలుపుతుంది, "దైవ చిత్తానుసారమైన[11] దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును"[12] జీవితము యొక్క మార్పు మారుమనస్సుకు ప్రతిఫలంగా వస్తుంది. పౌలు ఎక్కడికి వెళ్లినా, "వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని" ప్రకటిస్తున్నట్టు చెప్పుకున్నాడు (అపో. 26:20). మారుమనస్సు అనేది దైవ చిత్తానుసారమైన దుఃఖం **తరువాతను**, జీవిత మార్పుకు **ముందుగాను** వస్తుంది.

అప్పుడు, మారుమనస్సు అంటే ఏంటి? "మారుమనస్సు" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదానికి, "నూతనమైన మనస్సు కలిగియుండడం" అని అక్షరార్థం. **మారిన మనస్సును** అది సూచిస్తుంది.

జనులకు దాన్ని వర్తింపజేసినప్పుడు, పాపము విషయములో మనస్సు మార్చుకొనడం – మారుమనస్సు. పాపము దేవుని మనస్సును పగలగొట్టుతుందని ఒక వ్యక్తి గుర్తించినప్పుడు, పాపం ఎంత భయంకరమయ్యిందో అతడు చూస్తాడు. సిలువపై క్రీస్తు చనిపోయేలా చేసింది పాపమే అన్న విషయాన్ని ఒకడు నేర్చుకున్నప్పుడు, అతడు పాపంనుండి వెనుకకు తిరిగేలా చేస్తుంది. తన పాపం విషయమై దుఃఖించుతూ, దేవుని సహాయంతో, శ్రేష్ఠమైన జీవితాన్ని జీవిస్తానని అతడు తీర్మానించుకుంటాడు. అలాటి తీర్మానాన్నే బైబిలు "మారుమనస్సు" అని పిలుస్తుంది.

నిజమైన మారుమనస్సు ఒకని జీవితంమీద తన ప్రభావాన్ని కనుపరచుతుంది. అది పరిపూర్ణమైన జీవితాన్ని పుట్టించదు, ఎందుకంటే, పరిపూర్ణుడు ఎవడును లేడు; అయితే శ్రేష్ఠమైన జీవితంగా అది మార్చుతుంది. జీవితపు మార్పు జరుగకుంటే,

మారుమనస్సు అది కాకపోవచ్చు.

ఒకని మార్పులో మారుమనస్సు "బహు కఠిన భాగమైయుంది." అది అతి కఠినమైన భాగము ఎందుకంటే, జీవిత విధానానికి అది పిలుపునిస్తుంది. మార్పు కష్టమైనది. మార్పు బాధకరమైనది. ఏదియెలాగున్నా, మనం రక్షింపబడాలంటే మాత్రం – ప్రభువు యొక్క సహాయంతో మార్పు చెందడానికి ప్రయాసపడాలి.

## క్రీస్తును ఒప్పుకొనడం

ప్రభువైన యేసునందు ఒకనికున్న విశ్వాసాన్ని వ్యక్తపరచడానికి మరో మార్గం – ఆ విశ్వాసాన్ని ఒప్పుకొనడం. విశ్వాసానికీ ఒప్పుకోలుకూ మధ్యగల సన్నిహిత సంబంధం రోమా 10:9, 10లో కన్పిస్తుంది:

> ... యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును.[13]

నీవు రక్షింపబడగోరితే, "యేసును ప్రభువుగా ... నీవు ఒప్పుకు తీరాలి." ఈ ఒప్పుకునే అవసరతను గూర్చి ప్రభువే నొక్కి చెప్పాడు:

> మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యులయెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును ఎరుగనందును (మత్తయి 10:32, 33).

ప్రభువైన "యేసును ప్రభువుగా ... నీవు ఒప్పుకు తీరాలి" అంటే అర్థమేంటి? రోమా 10 మరియు మత్తయి 10 వైపు మళ్లా చూడు:

- అది యేసునందలి విశ్వాసాన్ని ఒప్పుకొనడం (గనుక అది పాపాలను ఒప్పుకొనడం కాదు[14]).
- అది నోటితో ఒప్పుకొనడం (గనుక అది జీవితంలో ఒప్పుకొనడం కాదు[15]).
- అది యితరులయెదుట ఒప్పుకొనడం (గనుక అది రహస్యపు ఒప్పుకోలు కాదు).

విశ్వాసం యొక్క ఒక ఒప్పుకోలు మత్తయి 16లో కన్పిస్తుంది: తానెవరైయున్నట్టు తన శిష్యులు తలంచుతున్నారో ప్రభువు వారిని అడిగినప్పుడు, పేతురు – "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ఒప్పుకున్నాడు (మత్తయి 16:16). "క్రీస్తు" అనే గ్రీకు రూపానికి హెబ్రీ పదం "మెస్సీయా," "అభిషిక్తుడని" అర్థం. శతాబ్దాల తరబడి యూదులు మెస్సీయా కొరకు ఎదురు చూస్తున్నారు. దేవునియొద్దనుండి పంపబడిన ఆ

మెస్సీయా యేసేయని పేతురు తన విశ్వాసాన్ని వ్యక్తపరచాడు. "సజీవుడగు దేవుని కుమారుడు" అనే ప్రయోగం, పేతురు యేసును దైవంగా గుర్తించినట్లు సూచిస్తుంది.

విశ్వాసం యొక్క మరొక ఒప్పుకోలు అపో. 8లో కన్పిస్తుంది. ఒప్పుకోలులో ఈ రెండవ ఉదాహరణ బాప్తిస్మానికి ముందు చేసింది. ఐతియొపీయ అధికారికి ఫిలిప్పు ప్రభువైన యేసును గూర్చి ఉపదేశం చేస్తున్నాడు.

> వారు త్రోవలో వెళ్లుచుండగా నీళ్లున్న యొక చోటుకి వచ్చినప్పుడు నపుంసకుడు[16] – ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు – నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు – యేసు క్రీస్తు దేవుని కుమారుడని[17] విశ్వసించుచున్నానని యుత్తర మిచ్చెను. ఫిలిప్పు నపుంశకుడు ఇద్దరును నీళ్లలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను (అపో. 8:36–38).

ఆ అధికారి యొక్క విశ్వాసపు ఒప్పుకోలు, మత్తయి 16లో పేతురు చేసిన ఒప్పుకోలువంటిదే. అది "మనుష్యుల యెదుటను," "నోటితో చేయబడిన" ఒప్పుకోలు అనే విషయాన్ని గమనించు (ఫిలిప్పు అనే ఒకే మనిషి యెదుట అది వాస్తవంగా జరిగింది).

నీవు బాప్తిస్మము పొందక ముందు ప్రభువైన యేసునందు నీ విశ్వాసాన్ని నీవు ఒప్పుకోవాలి. బాప్తిస్మం యివ్వడానికి ముందు ఆ విశ్వాసం రావాలని క్రీస్తు చెప్పారు (మార్కు 16:16). అతడు నమ్ముతున్నాడనే నిశ్చయత నాకు కలిగేవరకు నేను ఒకనికి లేఖనానుసారంగా బాప్తిస్మం యివ్వలేదు. అతడు నమ్ముతున్నాడని నాకెలా తెలుసు? (ఆ సంగతి) అతడు నాకు చెప్పాలి.

జనులు బాప్తిస్మము పొందక ముందు, యేసు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తని నమ్ముతున్నారా అని సహజంగా అడుగబడతారు. కొందరు కేవలం "అవును" అని బదులిస్తారు. కొందరైతే వారి విశ్వాసాన్ని గూర్చిన ప్రతిపాదనను చేస్తారు. "మంచి ఒప్పుకోలు" ఒప్పుకొనడంలో రెండును చట్టసమ్మతంగా చెల్లుతాయి (1 తిమోతి 6:12, 13).[18]

నీవు బాప్తిస్మం పొందిన తరువాత కూడా ప్రభువును ఒప్పుకొనే నీ ఒప్పుకోలు కొనసాగాలి సుమీ. అది క్రైస్తవులు క్రీస్తునందలి తమ విశ్వాసాన్ని స్థాపించుకొనడానికి గాను చేప గుర్తును ఉపయోగించేవారట:[19]



"చేప"కు గ్రీకు పదం *ichthus* గ్రీకు పెద్ద అక్షరాల్లో వ్రాస్తే అది యిలా ఉంటుంది:

**ΙΧΘΨΣ**

ఈ పదంలోని గ్రీకు అక్షరాలు ప్రభువైన యేసుయొక్క నామములను, బిరుదులను

సూచించడానికి ఉపయోగించేవారు:

- I (iota) *Iesous,*[20] అనే గ్రీకు పదంలో మొదటిది “యేసు.”
- X (chi) *Christos,* “క్రీస్తు” అనే దానిలో మొదటి అక్షరం.
- Θ (theta) *Theou,* “దేవుడు” అనే పదంలో అది తొలి అక్షరం.
- Ψ (upsilon) *Uios*, “కుమారుడనే” పదంలో తొలి అక్షరం.
- Σ (sigma) *Soter*, “రక్షకుడు” అనే గ్రీకు పదానికి తొలి అక్షరం.

ఈ చిన్న ఎక్రోస్టిక్‌ను ఉపయోగించుకొనడం ద్వారా, యేసు క్రీస్తనియు, ఆయన దేవుని కుమారుడనియు, ఆయన రక్షకుడై యున్నాడనియు ఆది క్రైస్తవులు ఆయనయందు తమ విశ్వాసాన్ని స్థాపించుతూ ఉండేవారు.

## ముగింపు

ఈ పాఠము విశ్వాసము యొక్క ప్రతిచర్యమీద కేంద్రీకరించబడింది – మారు మనస్సుకు నడిపించు విశ్వాసము, యేసుక్రీస్తును ఒప్పుకొనేలా చేసే విశ్వాసము. తరువాత పాఠంలో బాప్తిస్మమనే ప్రతిచర్యను గూర్చి చర్చించుదాం.

నేను యిప్పుడు అడుగగోరే ప్రశ్నేమంటే – “నీవు యేసునందు విశ్వాసముంచు తున్నావా?” నిన్ను నీవే ఆ ప్రశ్నను అడుగుకో. యేసు సజీవుగడు దేవుని కుమారుడైన క్రీస్తు అని నీవు నిజంగా విశ్వసించుచున్నావా? ఈ విశ్వాసం నీ పెదవులమీద ఉందా? నీ జీవితంపై ఈ విశ్వాసం తన ప్రభావాన్ని కనుపరచుతుందా? “నేనే ఆయనని [దేవుని యొద్దనుండి పంపబడిన మెస్సీయానని] విశ్వసింపని యెడల మీరు మీ పాపముల లోనే చత్తురు” అని ప్రభువు సెలవిచ్చుచున్నాడు (యోహాను 8:24).

---

సూచనలు

[1]ఒత్తి పలికింది నాది. [2]ఒత్తి పలికింది నాది. [3]“సువార్త” ఆంగ్ల పదమైనా, గ్రీకు పదమైనా “శుభవార్త” అనే భావాన్ని యిస్తుంది. 1 కొరింథీ. 15:1–4లో, తన సందేశం యొక్క కేంద్రస్థానం – ప్రభువైన యేసుయొక్క మరణం, సమాధి, పునరుత్థానాలైయున్నట్టు పౌలు తెలిపాడు. [4]మెస్సీయా అనే హెబ్రీ మాటకు అభిషిక్తుడని అర్థం. యూదుల యొక్క రాజులు కిరీటం ధరింపజేయబడినప్పుడు, నూనెతో అభిషేకించబడినవారై, వారు దేవుని అభిషిక్తులని పిలువబడేవారు. యూదులు గొప్ప రాజుయొక్క రాకకు ఎదురు చూచేవారు – కట్టకడపటిగా అభిషేకింపబడినవాడు, మెస్సీయా. యేసు వారి మెస్సీయాయే, కాని అనేకమంది యూదులు ఆ సత్యాన్ని గ్రహింపలేకపోయారు. [5]యేసునందు విశ్వాసముంచితే, దేవునియందును విశ్వాసముంచవలసినట్టు ఊహించబడింది (హెబ్రీ. 11:6). మరియు బైబిలునందును విశ్వాసముంచవలసినట్టుంది. “అధికారం” మీద పాఠాన్ని చూడు. [6]దేశముగా యూదులు యేసును మెస్సీయాగా అంగీకరించలేదు. [7]ఒత్తి పలికింది నాది. [8]రెండు స్థలాల్లోను “నమ్మి” అని KJV అంటుంది గాని NASBలో సూచించినట్టు రెండు రకాలైన గ్రీకు పదాలు అక్కడ ఉపయోగించబడ్డాయి. [9]పౌలు ఎఫెసీ. 2:9లో చెప్పినదానికి వ్యతిరేకంగా ఉన్నట్టు యిది వినిపిస్తుంది. పౌలు యోగ్యతా కార్యములను గూర్చి మాట్లాడుతూ ఉండగా, విశ్వాసము యొక్క వ్యక్తపరచే

కార్యములుగా యాకోబు మాట్లాడుతున్నట్టు గ్రహించాలి. [10]గత పాఠాన్ని చూడు.

[11]దైవ సంబంధమైన దుఃఖము అని KJV అంటే, దేవుని చిత్తానుసారమైన దుఃఖమనే దానికి వివరణనిస్తుంది. దైవ సంబంధమైన దుఃఖం అంటే అదే. [12]2 కొరింథీ. 7:10 ప్రస్తావించితే "లోక సంబంధమైన దుఃఖము" తప్పు జరిగించడంలో పట్టుపడిన వ్యక్తి వ్యక్తపరచేది, లేక అతని చర్యలకు ప్రతిఫలంగా కలిగే దుఃఖము. పాపమును విడిచిపెట్టేలా చేసే దుఃఖం అది కాదు. [13]రక్షణ "విశ్వాసంవలన మాత్రమే" అని ఈ లేఖన భాగం చెప్పుతున్నట్టు కొందరు చెప్పారు. విశ్వాసం మాత్రమే కాదు విశ్వాసము ప్లస్ అని ఈ లేఖన భాగం బోధించుతున్నట్టు గమనించాలి. విశ్వాసము – ప్లస్– ఒప్పుకోలు. ఇతర లేఖన భాగాలలో విశ్వాసము ప్లస్ – మారుమనస్సు; విశ్వాసము ప్లస్ – బాప్తిస్మము లేక మరో విధమైన కాంబినేషన్. విశ్వాసము ప్లస్ అనేది విశ్వాసం మాత్రమే కాదు. రక్షణను గూర్చి బైబిలు చెప్పే దానినంతటిని మనం ఆలోచింపవలసి ఉంటుంది. [14]పాపులను ఒప్పుకొనడాన్ని గూర్చి తరువాత చర్చించుకుందాం. క్రైస్తవుడు తన పాపములకు క్షమాపణ ఎలా పొందుతాడో దాన్ని గూర్చి ఆలోచించినప్పుడు అది వస్తుంది, అయితే ఒకడు క్రైస్తవుడు కాకమునుపు పాపాలను ఒప్పుకోవలసిందిగా కోరబడలేదు. బాప్తిస్మాన్ని ఒక వ్యక్తి కోరడం అనే క్రియ ద్వారా "రక్షణ యొక్క అవసరంలోనున్న పాపిని" అని అతడు చెప్పుతున్నాడు. [15]మన జీవితాల ద్వారా ప్రభువైన యేసును ఒప్పుకోవలసిన అవసరత ఉన్నమాట వాస్తవమే. అయినా, మత్తయి 10లోను రోమా 10లోను భావం అదికాదు. [16]నపుంసకుడనే దానికి సాధారణమైన భావం పురుష అవయవాలు తొలిగింపబడినవాడు అనేది అర్థం. హెచ్చు స్థాయిలోని అధికారుల యొక్క శోధనల అపాయంనుండి – ఈ అవయవాలు తొలిగింపబడడం అన్య జనులలో సహజంగా జరుగుతుంది. [17]ఈ వచనం కుండలీకరణాలలో ([ ]) పెట్టబడడంలో, కొన్ని తర్జుమాలు ఈ వచనాన్ని ఫుట్ నోట్‌లో ఉంచారు. ఏ విధంగానైనా, బాప్తిస్మానికి ముందు ఒకని విశ్వాసపు ఒప్పుకోలు చేయించడమనేది ఆది సంఘం యొక్క ఆచరణయై ఉండినట్టు అనేకమంది పండితులు అంగీకరిస్తారు. [18]ప్రభువైన యేసు మంచి ఒప్పుకోలు ఒప్పుకొనినప్పుడు (1 తిమోతి 6:13), పేతురు ఏమి అన్నాడో, ఆయన దానిని స్థిరపరచాడు (మత్తయి 27:11). [19]మత సంబంధం కాని చరిత్రనుండి ఈ గుర్తును మనం ఎరుగుదుము కాని, బైబిలునుండి కాదు సుమీ. చేప యొక్క గురుతు తరచుగా ఆది క్రైస్తవుల యొక్క సమాధులమీద కన్పిస్తుంది. [20]గ్రీకు మాటల యొక్క ఉచ్ఛరణ ప్రత్యేకమైన గుర్తులచేత ప్రభావితం చేయబడుతుంది. అలాటి వాటికి యిక్కడ నేనేమీ వ్యత్యాసం చూపలేదు.